
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 22 । మే । 2023



సముద్రంలోకి 11,778 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 11,778 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదైంది.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సుదర్శన హోమానికి కోసూరి వంశీకృష్ణరాజు, రాజశ్రీ దంపతులు (హైదరాబాద్) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
41.5° / 25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.5	26.0
కాకినాడ	37.0	25.5
అమలాపురం	39.2	27.0

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి కృషి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఐ.పోలవరం: గ్రామాల్లో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఐ.పోలవరం మండలం మురమళ్ల వచ్చిన ఆయన స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, లోకసభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీలు తమ సమస్యలను ఆయనకు లిఖిత పూర్వకంగా అందజేశారు. ఆయన వెంట విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, రేవు శ్రీనివాసరావు, గుత్తాల డాన్‌బాబు, గుత్తాల ప్రసాద్, అంబటి రామకృష్ణ తదితరులున్నారు.

వాడపల్లి నిత్యాన్నదాన పథకానికి భక్తుల విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. నరసాపురానికి చెందిన పి.సూర్యకృష్ణ బాల సుబ్రహ్మణ్యం రూ.11 వేలు, పి.బాల షన్ముఖ ఆదిత్య రూ.11 వేలు, పీవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, సత్యనాగ జ్యోతి దంపతులు రూ.11 వేలు విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందించారు.

కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. చిన్నారులకు అన్న ప్రాసనలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు చేశారు. స్వామివారి నిత్యాన్నదాన పథకం నిర్వహణ కోసం రూ.17,011 విరాళంగా భక్తులకు సమర్పించారు. స్వామివారికి ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.80,021లు లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలోను, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, తహసీల్దార్ కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే అర్జీలను స్వీకరిస్తారని, గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

నేడు సప్త గోదావరి ఆధునీకరణకు శ్రీకారం

రూ. కోటి మంజూరు చేసిన ప్రభుత్వం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి ఆధునికీకరణ పనులు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు ఈఓ పితాని తారకేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. సప్తగోదావరిని ఆధునికీకరించి భక్తుల మనోభావాలకు అనుగుణంగా స్వచ్ఛమైన నీరు ఎల్లప్పుడూ ఉంచేలా రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధతో సప్తగోదావరి ప్రక్షాళనకు నిధులు మంజూరు చేయించారన్నారు. దేవదాయ శాఖ సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులు రూ. కోటి మంజూరు చేసిందన్నారు.



స్వర్ణరకం (ఎంటీయూ-7029)

ఖరీఫ్ కసరత్తులు

- ఈసారి కూడా ముందస్తు సాగుకే ప్రభుత్వం మొగ్గు
- 1.86 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని అంచనా

సాక్షి, అమలాపురం: ఖరీఫ్ సాగు**కు డెల్టా రైతులు** సిద్ధమవుతున్నారు. రబీ కోతలు **పూర్తి కావస్తుండ**డం, ధాన్యం కొనుగోలు వేగంగా సాగుతున్న నేపథ్యంలో ఇటు రైతులు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. జూన్ 1 నాటికి డెల్టా పంట కాలువలకు నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తుండగా, వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ఎరువులను సిద్ధం చేయగా, విత్తనాల అవసరాలను గుర్తించేందుకు కసరత్తు జరుగుతోంది. జిల్లాల విభజన తరువాత ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో అతి పెద్ద వరి ఆయకట్టు ఉన్న జిల్లాగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుర్తింపు సంతరించుకుంది. తూర్పు డెల్టా పరిధిలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, మధ్య డెల్టా పరిధిలో మొత్తం ఆయకట్టు ఉంది. ఈ రెండు డెల్టాల్లో వరి ఆయకట్టు సుమారు 2.30 ఎకరాల ఆయకట్టు ఉండగా, ఇక్కడ వచ్చే ఖరీఫ్ సుమారు 1.86 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా.

జూన్ 1వ తేదీకే కాలువలకు నీరు విడుదల



తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువ

ఖరీఫ్ ముందస్తు సాగుకు ప్రభుత్వం గత ఏడాది తెర లేపిన విషయం తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 మధ్య భారీ వర్షాలు, వాయుగుండ, తుఫాన్ల బారిన ఖరీఫ్ పడకుండా ముందస్తు సాగుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. దీనిలో భాగంగా గతంలో జూన్ 10 నుంచి 15 మధ్యలో డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తుండగా, గత ఏడాది నుంచి జూన్ 1వ తేదీ నాటికి కాలువలలో నీరు వదులుతున్నారు. ఈ ఏడాది కూడా జూన్1వ తేదీకి నీరు విడుదల చేయాలని ఇప్పటికే కాకినాడ జిల్లాలో జరిగిన జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో నిర్ణయించారు. త్వరలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే సమావేశంలో కూడా ఇదే తేదీన నీటి విడుదల చేయాలని నిర్ణయించడం ఇక లాంఛనమే.

విత్తనాలపై కసరత్తు

జిల్లాలో అధికంగా స్వర్ణ రకం (ఎంటీయూ-7029) సాగు చేయనున్నారు. తూర్పు, మధ్య డెల్టాల్లో సుమారు 60 శాతం చేలల్లో ఈ రకాన్ని సాగు చేసే **అవకాశముంది. అందుకు అనువుగా స్వర్ణ రకం విత్తనాలను ఎక్కువగా అందుబాటులో ఉంచనున్నారు. దీంతోపాటు సంపద (ఎన్‌పీ- 9558), ఎంటీయూ 1064 రకాలను సైతం సాగు చేయను**న్నారు. వీటితోపాటు ముంపు తట్టుకునే ఎంటీయూ 1318ని ఈసారి ఎక్కువగా సాగు చేసే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాంతాల వారీగా సాగు చేసే రకాలకు అనుగుణంగా లెక్కలు వేసి విత్తనాలను సిద్ధం చేసే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమై ఉన్నారు.

సగం ఎరువులు సిద్ధం

ఖరీఫ్ వరితోపాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలకు కావాల్సిన ఎరువులను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిపి ఖరీఫ్ సీజన్‌లో 46,918 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా అంచనా వేస్తున్నారు. దీంతో యూరియా సింహ భాగం ఆక్రమించింది. యూరియా 19,500 మెట్రిక్ టన్నుల అవసరంగా గుర్తించారు. ఇప్పటి వరకు మొత్తం ఎరువుల్లో 26,462 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచారు. వీటిని ప్రైవేట్ ఏజెన్సీలతోపాటు సహకార సంఘాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించనున్నారు.

త్వరలోనే నిర్ణయం



గోదావరి డెల్టా కాలువలకు ఈ ఏడాది కూడా జూన్ 1వ తేదీ నాటికి సాగు నీరు విడుదల చేయనున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లా ఐఏబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో కోనసీమ జిల్లా ఐఏబీ సమావేశం ఏర్పాటు చేయనున్నాం. దీనిపై అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

– డి.రామ్‌గోపాల్, జిల్లా ఇరిగేషన్ అధికారి

వైశ్యులు సమాజ సేవకులు

శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైశ్యులు సమాజ సేవకులని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జగన్నాథపురంలో కొలువుదీరిన వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారికి భక్తులు రూ.2 కోట్లతో తయారు చేయించిన మూడు కేజీల బంగారు చీరను అమ్మవారికి ఆయన ఆదివారం రాత్రి సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైశ్యులు వ్యాపారమే కాకుండా ఎంతో సమాజ సేవ కూడా చేస్తున్నారని అన్నారు. ఆర్యవైశ్యులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో అభిమానం ఉందని చెప్పారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఆర్యవైశ్యుల ఆధ్వర్యాన నడుస్తున్న ఆలయాలను వైశ్య సంఘాలకు అప్పగించారని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులపై ఉన్న మమకారంతోనే రాష్ట్రంలో చింతామణి నాటకాన్ని నిషేధిస్తూ జీఓ ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చింతామణి నాటకంలో ఆర్యవైశ్యులను కించపరిచే సన్నివేశాలున్నాయని, వారి మనోభావాలు దెబ్బ తింటున్నాయని చెప్పగానే ఆయన జీఓ ఇచ్చారని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, అందరూ కలసికట్టుగా అమ్మవారికి మూడు కేజీల బంగారంతో చీర తయారు చేయించడం అభినందనీయమని అన్నారు. గుడి ఉన్న వీధికి వాసవీమాత పేరు పెట్టామని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథిగా కోలగట్ల వీరభద్రస్వామిని ఆలయ కమిటీ ఆధ్వర్యాన భారీ గజమాల, వెండి కిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ పెద్ది రత్నాజీ, గోకులం అధ్యక్షుడు నారాయణం మురళి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, సోము ప్రసాద్, బాదం మధు, లింగమల్లు కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

31న తలుపులమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

- శ్రావణ మాసం నుంచి నూతన ఆలయంలో అమ్మవారి దర్శనాలు
- రూ.5 కోట్లతో ఆలయం, మహామంటపం పనులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఈ నెల 31వ తేదీన పునఃప్రతిష్ఠించనున్నామని లోవ దేవస్థానం ధర్మకర్తల మండల చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో ధర్మకర్తలతో కలసి వారు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. అమ్మవారి గర్భాలయం, మహామంటపం పునర్నిర్మాణ పనులు గత ఏడాది డిసెంబర్‌లో రూ.5 కోట్లతో ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. జూన్ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ మంచి ముహూర్తాలు లేనందువలన పండితుల సూచనల మేరకు ఈ నెల 31న అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించనున్నామని తెలిపారు. అనంతరం రెండు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి శ్రావణ మాసం నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు. అప్పటి వరకూ బాలాలయంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా ఉప దేవతల విగ్రహాలను కూడా ప్రతిష్ఠిస్తున్నామని చైర్మన్, ఈఓ చెప్పారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవా ల్లో భాగంగా ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకూ వివి ధ గ్రామాల భక్తుల భాగస్వామ్యంతో విశేష పూజలు, హోమాలు, భజనలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్, ఈఓ తదితరులు యా గశాల పందిరి రాట వేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు. సిమెంట్, ఇనుముతో పాటు నగదు రూపంలో రూ.70 లక్షల వరకూ విరాళాలు వచ్చాయని తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

దేవస్థానంలో హుండీలను సోమవారం తెరచి, తలుపులమ్మ అమ్మవారికి వచ్చిన ఆదాయాన్ని లెక్కించనున్నామని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ శాఖ పెద్దాపురం తనిఖీ అధికారి, ధర్మకర్తల సమక్షంలో హుండీలను తెరుస్తామన్నారు.

భక్తుల రద్దీ

తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పటికీ వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూల ద్వారా 12 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈఓ తెలిపారు. రవ్వలడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.1,27,890, పూజా టికెట్లకు రూ.1,21,330, తలనీలాలకు రూ.14,350, వాహన పూజలకు రూ.7,370, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.41,600, విరాళాలుగా రూ.1,13,247 కలిపి మొత్తం రూ.4,25,787 ఆదాయం సమకూరిందని వివరించారు.



యాగశాలకు పందిరి రాట పూజలు చేస్తున్న చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పునఃప్రతిష్ఠించనున్న తలుపులమ్మ అమ్మవారి విగ్రహం

జగనన్న ఆణిముత్యాలు ఎయిడెడ్ పాఠశాలలకూ వర్తింపజేయాలి



ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రభుత్వ విద్యాసంస్థల 10వ తరగతి, ఇంటర్ టాపర్ విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహకం ఎయిడెడ్ పాఠశాలలకు కూడా వర్తింపజేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఎయిడెడ్ పాఠశాలలకు ఇది వర్తింపజేయాలని పాఠశాల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన ఆదివారం ఫోన్‌లో అడిగారు. ఈ విషయమై పునరాలోచన చేస్తామని మంత్రి బొత్స ఎమ్మెల్సీ ఐవీకి తెలియజేశారు.

నవదంపతులతో రత్నగిరి కళకళ



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు

అన్నవరం: ఎక్కడెక్కడో తమ పెళ్లిపుస్తకానికి శ్రీకారం చుట్టుకున్న నవదంపతులు.. తమ జీవితం ఆనందమయం కావాలని, జీవితాంతం తోడూనీడగా కలిసి ఉండేలా అనుగ్రహించాలని ప్రార్థిస్తూ.. సత్యదేవుని దర్శించుకున్నారు. వరాలిచ్చే దేవునిగా పేరొందిన సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవికి మనసారా ప్రణమిల్లుతూ వ్రతాలు ఆచరించారు. రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిన, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోను శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఈ నవదంపతులు ఆదివారం సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలన్నీ నవదంపతులతో కళకళలాడాయి. సుమారు 50 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. వీరిలో నవదంపతులే వెయ్యి జంటలు ఉండటం విశేషం. గత నవంబర్‌లో వచ్చిన కార్తిక మాసం తరువాత ఆ స్థాయిలో స్వామివారి వ్రతాలు 4,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

49 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ

నల్లజర్ల: జిల్లావ్యాప్తంగా 49 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శేషగిరి వెల్లడించారు. దూబచర్ల సంఘమిత్రా స్కూల్‌లో నిర్వహిస్తున్న యోగా, చెస్ శిక్షణ శిబిరాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో 20 రకాల ఆటలపై దాదాపు 1,400 మంది విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన క్రీడా పరికరాలను రూ.2.50 లక్షలతో కొనుగోలు చేశామని తెలిపారు. వీటిని ఈ నెల 22, 23 తేదీల్లో ఆయా కేంద్రాలకు అందజేస్తామన్నారు.

లేటెస్ట్‌తో సమయం ఆదా

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పలు రోగాలకు అధునాతన పరీక్షలు
- 2 ఏరియా, 9 కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ఆటో ఎనలైజర్ మెషీన్లు
- 10 నిమిషాల్లో ఫలితాలు ఇచ్చే సదుపాయం
- ఇప్పటికే అందుబాటులోకి డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు

అమలాపురం టౌన్: పేదలకు అత్యవర వైద్యం అందించేందుకు అంతే అత్యవసరంగా, వేగంగా పలు రుగ్మతలకు టెస్టల రిపోర్టులు ఉండాలి. అధునాతన టెస్టింగ్ మెషీన్లు అందుబాటులో ఉన్నప్పుడే అంతే వేగంగా పేద రోగులకు వైద్యం అందుతుంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచీ ప్రత్యేక దృష్టి పెట్టి పేదలకు వైద్యం సకాలంలో అందించేలా పలు అధునాతన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా..

ఓ పక్క నాడు–నేడు పథకంతో ప్రభుత్వ ఆస్పత్రులకు మౌలిక సదుపాయాలు పెంచుతూనే మరో పక్క పలు రుగ్మతలకు అత్యవసరమైన అధునాతన టెస్టింగ్ మెషీన్లను దాదాపు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురంలోని రెండు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో లేటెస్ట్ టెస్టింగ్ మెషీన్లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని తొమ్మిది కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కూడా ఏరియా ఆస్పత్రులకు తెచ్చిన టెస్టింగ్ మెషీన్లను సమాంతరంగా అందించేందుకు చర్యలు చేపట్టింది. గతంలో మాన్యువల్‌గా టెస్టులు చేయడం ద్వారా కొంత ఆలస్యం కావడంతోపాటు, ఖచ్చితమైన రిపోర్టు రాకపోవడంతో ప్రతికూల పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు వివిధ రుగ్మతలకు సంబంధించి ఒకేసారి 72 శాంపిల్స్ అధునాతన మెషీన్ ద్వారా పది నిమిషాల్లో రిపోర్టు పొందే సదుపాయాలు ప్రభుత్వ ఆస్పత్రులకు ఉంది.

రూ.2.20 కోట్లతో ఆటో ఎనలైజర్లు

ఆటో ఎనలైజర్ అనే లేటెస్ట్ టెస్టింగ్ మెషీన్లను ఏర్పాటు చేయడంతో రిపోర్టులను రోగులకు నిమిషాల్లో అందిస్తున్నారు. వైద్యులు ఈ రిపోర్టుల ఆధారంగా అంతే వేగంగా సేవలు అందిస్తున్నారు. ఒక్కో ఆటో ఎనలైజర్‌ను రూ.20 లక్షల వ్యయతో నెలకొల్పారు. రెండు ఏరియా ఆస్పత్రుల్లో ఇప్పటికే ఆ మెషీన్లు పనిచేస్తున్నాయి. తొమ్మిది కమ్యూనిటీ ఆస్పత్రుల్లో నాడు– నేడు పనులకు సంబంధించి ఎలక్ట్రికల్ వర్కులు కొంత పెండింగ్ ఉండడం వల్ల మెషీన్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ అవి ఇంకా వినియోగంలోకి రాలేదు. త్వరలోనే కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కూడా ఈ ఆటో ఎనలైజర్ మెషీన్లు రోగులకు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు రూ.2.20 కోట్ల వ్యయంతో లేటెస్ట్ టెస్టింగ్ మెషీన్లను సమకూర్చారు.

డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లతోనూ అదే వేగం

ఇప్పటికే రెండు ఏరియా ఆస్పత్రుల్లో రూ.60 లక్షలతో డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌లు నెలకొల్పిన సంగతి తెలిసిందే. గతంలో ఎక్స్‌రే ఫోటో తీశాక ఫిలిం కోసం 20 నిమిషాల సమయం పట్టేది. ఇప్పుడు అధునాతన మెషీన్ల వల్ల సెకన్ల వ్యవధిలో ఎక్స్‌రే వస్తోంది. గతంలో చేతులు, కాళ్లకే ఎక్స్‌రేలు తీసేవారు. ఇప్పుడు నడుం, మెదడు, తల, భుజాలు వంటి విభాగాలకు కూడా ఎక్స్‌రేలు తీసే సామర్థ్యం పెరిగింది.

10 నిమిషాల్లో రిపోర్టు సిద్ధం

తాజాగా ఏర్పాటు చేసిన ఆటో ఎనలైజర్ మెషీన్ వల్ల కిడ్నీకి సంబంధించి నాలుగు రకాల టెస్టులు, లివర్‌కు సంబంధించి ఏడు రకాల టెస్టులు, లిపిడ్ ప్రొఫైల్‌కు సంబంధించి ఐదు రకాల టెస్టులు, సుగర్ తదితర టెస్టులకు కేవలం పది నిమిషాల్లో రిపోర్టులు సిద్ధం అవుతాయి. గతంలో ఇవే టెస్టులు 20 నిమిషాల నుంచి 30 నిమిషాలకు పైగా సమయం పట్టేది. ఇప్పుడు అధునాతన మెషీన్ల వల్ల సమయం ఆదా అవుతోంది.



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆటో ఎనలైజర్



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెస్ట్‌లు వేగవంతం చేశాం

గతంలో మాదిరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాన్యువల్ టెస్ట్ రిపోర్టులతో అయ్యే ఆలస్యాన్ని చాలా వరకూ నిరోధించాం. ఇప్పుడు డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు, ఆటో ఎనలైజర్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చాం. అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రుల్లో అయితే అధునాతన టెస్ట్ రిపోర్టులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. తొమ్మిది కమ్యూనిటీ ఆస్పత్రులో కూడా ఇప్పటికే కొన్ని సదుపాయాలు తెచ్చాం. నేడు-నేడు పనులు వంద శాతం పూర్తి కాగానే అన్నీ అందుబాటులోకి తెస్తాం.

– డాక్టర్ పద్మశ్రీ రాణి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ కర్త, అమలాపురం

క్లుప్తంగా

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 52, 517 మంది విద్యార్థులు
- 109 కేంద్రాల్లో నిర్వహణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 109 పరీక్షా కేంద్రాలలో మే 24 నుంచి ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం ఆ వివరాలను తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 52,571 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 19,336 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో 21,120 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14,257 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,426 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 36 సెంటర్లు (కొవ్వూరు డివిజన్‌లో 11 కలిపి) కాకినాడ జిల్లాలో 39 సెంటర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 27 సెంటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో డే సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 16 స్టోరేజ్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. ఆయా రూట్లలో ఉదయం 6 గంటల నుంచే ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, అన్ని శాఖల సహాయ సహకారాలు కోరామని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 196 మంది అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. డీఈసీ మెంబర్ ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి సీనియర్స్ రగ్బీ పోటీలు

పిఠాపురం: పట్టణంలో ఉన్న ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానంలో 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల రగ్బీ పోటీలు నిర్వహించనున్న క్రీడా మైదానాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో 400మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఇంట్లో ఉన్నా వడదెబ్బ ముప్పు



- వృద్ధులు, పిల్లలు, గృహిణులకు ఎక్కువ అవకాశం
- ఆదమరిస్తే ప్రాణాల మీదకే
- పానీయాలు, ఓఆర్ఎస్‌తో చెక్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ) : ఎర్రని ఎండల్లో ఇంట్లో నుంచి కాలు బయటపెట్టకుండా ఉంటే చాలు వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు అనుకుంటున్నారా? ఎండల్లో తిరిగినా, ఇంట్లో నీడ పట్టున ఉండిపోయినా వడదెబ్బ నుంచి తప్పించుకోవడం ఎవరి తరం కాదు. వృద్ధులు, చిన్న పిల్లలు, గృహిణులు ఈ ఇండోర్ సన్‌స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువ. బయట వాతావరణంలో వేడికి సమానంగా ఒకటి రెండు డిగ్రీల తక్కువలో ఇంట్లో కూడా వేడి వాతావరణం ఉంటుంది. రాష్ట్ర వాతావరణ, విపత్తుల శాఖ వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని వివిధ ప్రసార సాధనాల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తోంది.

ఎందుకిలా?

గది ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరితే ఇండోర్ హీట్ స్ట్రోక్ తగిలే ప్రమాదం ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత, గది ఉష్ణోగ్రత 25 నుంచి 28 డిగ్రీల సెల్సియస్ మాత్రమే ఉండాలి. కానీ ఇంట్లో వాతావరణం వేడెక్కిపోవడం మూలంగా ఆ ప్రభావం మన శరీరాలపై పడుతుంది. ఎండలో తిరగడం వల్ల ఎంత ప్రమాదకరమైనదో, ఇంటిపట్టున తగిలే హీట్‌స్ట్రోక్ కూడా అంతే ప్రమాదకరమైనది. గదులు చిన్నవిగా, గాలి చొరబడే వీలు లేకుండా ఉన్నా, తలుపులు మూసి ఉంచుకున్నా, గదిలో ఫ్యాన్‌గాలి బయటకు వెళ్లే వీలు లేక అదే ప్రదేశంలో గాలి తిరుగుతూ ఉన్నా, గది ఉష్ణోగ్రత బయటి ఉష్ణోగ్రత కంటే ఐదు లేదా ఆరు డిగ్రీలు పెరిగిపోతుంది. విపరీతమైన ఉక్కపోత, డీహైడ్రేషన్ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఎయిర్ కండీషనర్లు, ఎయిర్‌కూలర్లతో గదిలో వాతావరణాన్ని చల్లబరిచి, 25 డిగ్రీల కంటే తక్కువకు తగ్గించుకోవాలి. ఏసీ, కూలర్లు లేకపోతే, కిటికీలను తెరచి ఇంట్లోకి గాలి చొరబడేలా చేయాలి. కిటికీలకు తడిపిన కర్టెన్లు కట్టాలి. వంటింట్లో పని చేస్తున్నప్పుడు ఎగ్జాస్ట్ ఫ్యాన్ తప్పక ఉపయోగించాలి.ప్రతి అరగంటకూ నీళ్లు తాగుతూ ఉండాలి.



ఈ పానీయాలు శ్రేష్టం

సుగంధ పాల వేరుతో తయారు చేసే నన్నారి పానీయం వేసవి వేడిమి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. పచ్చి మామిడికాయతో తయారు చేసే ఆమ్ కా పన్నా, పుదీనా, జీలకర్ర పొడి కలిపిన తాజా మజ్జిగ, లేత జామ ఆకులు, కొత్తిమీర, తులసి, పుదీనా ఆకులను జోడించిన మజ్జిగ లాంటి పానీయాలు ఎండదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తాయి. ఉసిరి కాయ ముక్కలు, కొద్దిగా అల్లం, చక్కెర దంచి, నీళ్లు కలుపుకుని తాగాలి. తాజా మజ్జిగలో సన్నగా తరిగిన అల్లం, నిమ్మ ఆకులు, కరివేపాకు వేసి కలుపుకుని తాగినా ఫలితం ఉంటుంది.

దశల వారీగా సన్‌స్ట్రోక్..

వడదెబ్బ తగిలితే, మొదటి దశలో తీవ్రమైన అలసట, కండరాల బలహీనత, చమటలు పట్టే పరిస్థితి ఉంటుంది. రెండో దశలో శరీరం నిస్సత్తువగా మారిపోయి, అయోమయ పరిస్థితి నెలకొంటుంది. మూడో దశలో శరీరంలో ఎలక్ట్రొలైట్లను కోల్పోవడం మూలంగా స్పృహ కోల్పోయి కుప్పకూలిపోతారు. ఈ పరిస్థితిలో చికిత్స అలస్యమైతే ప్రాణాపాయ పరిస్థితికి దారి తీస్తుంది. ప్రతి అరగంటకూ ఓఆర్ఎస్, ఇతర ద్రవాలను అందిస్తూ, చల్లని నీళ్లతో స్నానం చేయిస్తే, వడ దెబ్బ నుంచి కోలుకునే అవకాశాలు పెరుగుతాయి. ఇలా చేసినప్పటికీ ఫలితం లేకపోతే వైద్యుల దగ్గరకు తీసుకువెళ్లాలి.

చిట్కాలు పాటిస్తే రక్షణే....

ఇండోర్ హీట్‌స్ట్రోక్ తగలకుండా ఉండాలంటే రోజులో 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలి. మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఇంట్లో తయారు చేసిన పండ్ల రసాలు తీసుకోవాలి. ఓఆర్ఎస్ లేదా ఎలక్ట్రాల్ నీళ్లు అదనంగా తీసుకోవాలి. ఆల్కహాల్, కెఫీన్, కృత్రిమ పండ్ల రసాలు, శీతల పానీయాలు శరీరాన్ని మరింత డిహైడ్రేట్ చేస్తాయి. కాబట్టి వేసవిలో వీటితో దాహార్తిని తీర్చుకోకూడదు. మసాలాలు, ఉప్పు, కారం ఎక్కువగా ఉండే పదార్థాలు తినకూడదు.

పెరుగన్నం, చల్లదనాన్నిచ్చే పుచ్చ, దోస, బత్తాయి, కీరా లాంటివి తీసుకోవాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఎండలోకి వెళ్లకూడదు. సరిపడా నిద్ర, విశ్రాంతి అవసరం. రోజుకు రెండుసార్లు చల్లటి నీళ్లతో స్నానం చేయాలి. ఇంట్లో ఉన్నా, బయటకెళ్లినా లేత రంగులతో కూడిన తేలికైన, చమటను పీల్చే కాటన్ దుస్తులు ధరించాలి. ఉదయం వేళ పెందలాడే వంట ముగించుకోవాలి.

ఫ్రిడ్జ్ నీళ్లు వద్దు

డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండాలంటే ఫ్రిజ్ నీళ్ల తాగకూడదు. ఫ్రిడ్జ్ నీళ్లు జీర్ణమై రక్తంలో కలవడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో శరీరంలో నీటి మోతాదు తరిగి డీహైడ్రేషన్‌కు గురవుతాం. గది ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉన్న నీళ్లు లేదా కుండ నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి.

డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి



వేసవి కాలంలో చెమట రూపంలో శరీరంలోని నీరు బయటకు పోతుంది. దీంతో శరీరంలో నీటితో పాటు వెలుపలికి వెలుపోయిన లవణాలు కొబ్బరినీరు, మంచి నీరు, పుచ్చకాయ, ముంజులు, మజ్జిగ వంటి ఆహార పదార్థాలతో భర్తీ చేసుకోవాలి. లేదంటే శరీరం డీ హైడ్రేషన్‌కు గురయి ఇండోర్ సన్ స్ట్రోక్ తగిలే ప్రమాదం ఉంది. ఏసీ వాడేవారు గది ఉష్ణోగ్రత 25 నుంచి 26 డిగ్రీల మధ్య ఉండేలా చూసుకోవాలి. 16 లేదా 18 డిగ్రీలు పెట్టుకుని ఒకేసారి 38 నుంచి 40 డిగ్రీలలోకి వెళితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది.

– ఏఆర్ఎంఓ డాక్టర్ రాహుల్, జీజీహెచ్ కాకినాడ

ఎండు గడ్డి దగ్ధం

అల్లవరం: గోడితిప్ప నుంచి మొగళ్ళమూరుకు ఎండు గడ్డితో వెళుతున్న మొగళ్ళమూరు రొక్కాల వెర్రియ్యకు చెందిన ట్రాక్టర్ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో గోడితిప్ప బసవా వరహాలు ఆస్పత్రికి ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు ఎక్కుతుండగా స్తంభాలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గడ్డి ట్రాక్టర్‌కు తగిలి మంటలు చెలరేగాయి. మెయిన్‌రోడ్డు కావడం, రోడ్డుపై ఆ సమయానికి ట్రాఫిక్ లేకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా హైడ్రాలిక్ ట్రక్కుని లిఫ్ట్ చేసి ఎగసిపడుతున్న మంటలతో కూడిన గడ్డిని రోడ్డుపైకి వదిలేశాడు. కూలీలు కూడా సహకరించడంతో ట్రాక్టర్‌లోని గడ్డి రోడ్డుపై పడింది. ఈ ఘటనపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అమలాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ వైర్లు నేలబారున వేలాడుతుండడంతో గడ్డి ట్రాక్టర్ అగ్ని ప్రమాదానికి గురైందని స్థానికులు చెప్పారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయమని అనేక పర్యాయాలు విన్నవించినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని చెప్పారు.

ఈత సరదా తెచ్చిన కడుపు కోత

- గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల మృతి
- పోలీసు శాఖ హెచ్చరిస్తున్నా ప్రయోజనం శూన్యం



గెద్దం కరుణకుమార్ (పాతచిత్రం)



మోటూరి త్రిలోక్ (పాతచిత్రం)



జొన్నాడలోని గౌతమీ గోదావరి తీరంలో బోరున విలపిస్తున్న మృతుని బంధువులు

ఆలమూరు: ఈత సరదా రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. స్నేహితుని పుట్టినరోజు వేడుకలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన ఆ యువకులిద్దరూ అంతలోనే కనుమరుగయ్యారు. కళ్లముందే తమ స్నేహితులిద్దరూ మునిగిపోవడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిని చూసుకుని సహచరులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనుమతి లేని నదీ తీర ప్రదేశాల్లో స్నానాలు చేయవద్దని పోలీసుశాఖ హెచ్చరికలు చేస్తున్నా పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొత్తపేటలోని శ్రీషిర్డీసాయి ఆలయం సమీపంలో నివసిస్తున్న గెద్దం కరుణకుమార్ (22), అయినవిల్లి మండలంలోని పెద్దపాలెం గ్రామానికి చెందిన మోటూరి త్రిలోక్ (17) తన స్నేహితులతో కలిసి ఆలమూరు మండలంలోని జొన్నాడకు వచ్చారు. స్థానికంగా ఉన్న ఒక రెస్టారెంట్‌కు వెళ్లి తమ స్నేహితుడైన కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన అయినవిల్లి భవానీశంకర్ జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆరుగురు విందు ఆరగించారు. అనంతరం స్థానిక పుష్కరఘాట్ సమీపంలోని ఇసుక ర్యాంపునకు వెళ్లే దారిలో ఉన్న రేవులో స్నేహితులందరూ వివిధ ప్రదేశాల్లో స్నానాలకు దిగారు. అందరూ స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా కరుణకుమార్, త్రిలోక్ మునిగి పోతూ కేకలు వేయడంతో మిగతా స్నేహితులు భయంతో రేవులోంచి బయటకు వచ్చి వేగంగా ఒడ్డుకు చేరుకున్నారు. సహాయం కోసం స్థానికులను పిలిచే లోపలే వారి కళ్ల ముందు ఇద్దరు స్నేహితులు గల్లంతయ్యారు. స్థానికుల ఇచ్చిన సమాచారంతో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై ఎస్.శివప్రసాద్ సత్వరమే స్పందించి పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు స్నానాలు చేస్తూ మునిగిన ప్రదేశంలోని కూతవేటు దూరంలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై శివప్రసాద్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని ప్రదేశాల్లో స్నానాలకు దిగొద్దు

గౌతమీ గోదావరి తీరం వెంబడి అనుమతి లేని ప్రదేశాల్లో స్నానాలకు దిగవద్దని ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గత అనుభవాల దృష్ట్యా ప్రతి గ్రామంలోను హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిపై స్థానికులు అవగాహన పెంచుకుంటున్నా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గోదావరి తీరంలో ఉన్న ఊబిని అంచనా వేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు.

శోక సంద్రమైన నదీ తీరం

రేవులో స్నానం చేస్తూ మునిగిపోయి మృత్యువాత పడ్డ జొన్నాడలోని గౌతమీ గోదావరి తీరం బంధువుల రోదనలతో శోకసంద్రమైంది. అల్లారు ముద్దుగా పెంచిన కొడుకులు అతి చిన్న వయస్సులో మృత్యువాత పడటాన్ని కరుణకుమార్, త్రిలోక్ కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. జొన్నాడ రేవులో స్నానాలు చేస్తూ మృతి చెందారనే విషయం తెలుసుకున్న మృతుల తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా విలపించారు.

అందొచ్చిన కొడుకు అనంత లోకాలకు

కొత్తపేట: అందొచ్చిన కొడుకు అందని లోకాలకు వెళ్లిపోయాడంటూ గోదావరి ప్రమాదంలో మృతి చెందిన గెద్దం కరుణకుమార్ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. రెక్కాడితే కాని డొక్కాడని తల్లిదండ్రులకు కరుణకుమార్ ఆర్థిక పరంగా అంది వచ్చాడు. కొత్తపేట షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలో బాబా కాలనీకి చెందిన గెద్దం దుర్గారావు దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. దుర్గారావు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా భార్య వంటపనికి వెళుతూ కుటుంబానికి సహాయ పడుతుంది. కాగా ప్రాథమిక విద్యతో సరిపెట్టిన కరుణకుమార్‌ను అతని బావ నర్సరీ వ్యాపారం నిమిత్తం వెంట తీసుకువెళ్లి ఉపాధి కల్పిస్తున్నాడు. ఆవిధంగా అక్కడ వచ్చే జీతం కుటుంబానికి పంపుతూ ఆర్థికంగా చేదోడుగా నిలుస్తున్నాడు. నాలుగైదు నెలలకొకసారి గ్రామానికి వచ్చి తల్లిదండ్రుల యోగక్షేమాలను చూసి తిరిగి హైదరాబాద్ వెళుతుంటాడు. ఇటీవల తల్లిదండ్రులను చూడటానికి వచ్చిన కరుణకుమార్ శనివారం కోరుమిల్లిలో ఉంటున్న తన అక్కను చూసేందుకు అక్కడకు వెళ్లాడు.

తాళ్లరేవు ఆటో ప్రమాదంలో 8కి చేరిన మృతులు

- మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచిన మరో మహిళ
- కురసాంపేటలో విషాదం



తల్లిని కోల్పోయిన బాధలో చిన్నారులు నాగదుర్గ, రిషిత



చికిత్స పొందుతూ మృతి చెందిన నోట్ల సత్యవేణి

యానాం: తాళ్లరేవు-యానాం 216 జాతీయ రహదారిపై ఈ నెల 14వ తేదీన ప్రైవేట్ బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. తీవ్రంగా గాయపడి కాకినాడలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యానాం పట్టణ పరిధిలోని కురసాంపేటకు చెందిన నోట్ల సత్యవేణి (30) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆఖరికి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతురాలు గత 8 ఏళ్లనుంచి తాళ్లరేవులోని ఎపెక్స్ రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాగదుర్గ 6వ తరగతి చదువుతుండగా, రిషిత 5 వ తరగతి చదువుతోంది. సత్యవేణి అమ్మ గారి ఊరు తాళ్లరేవు మండలం కోరంగి అని, భర్త లోవరాజుది కురసాంపేట గ్రామమని పేదరికంతో అక్కడే అద్దెకుంటూ వ్యవసాయ కూలీగా జీవనాన్ని సాగిస్తున్నాడని బంధువులు తెలిపారు.

ఇద్దరు ఆడపిల్లలు...ఆలనాపాలనా చూసేదెవరు...

ప్రభుత్వం ఆదుకోవాలి...ఆటో ప్రమాదంలో మృతిచెందిన నోట్ల సత్యవేణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఇద్దరు చిన్నారులు ఉన్నారని వారికి ఆర్థికంగా సహాయ పడాలని విజ్ఞప్తి చేశారు. సత్యవేణి అంత్యక్రియలు ఆదివారం స్థానిక హిందూశ్మశాన వాటికలో నిర్వహించారు.



మృత్యువాత పడ్డ యువకులు

తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు

అయినవిల్లి: మోటూరి త్రిలోక్ మృతితో అయినవిల్లి మండలం ఎస్.పెదపాలెం టి.సావరం గ్రామంలో విషాదం నెలకొంది. మోటూరి త్రిలోక్ తండ్రి శ్రీను వ్యవసాయ పనులు చేస్తుంటాడు. తల్లి సత్యవేణి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు. త్రిలోక్ పెద్దకుమారుడు. ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఉన్నత చదువులు చదివి తమకు పెద్ద దిక్కుగా ఉంటాడనుకున్న పెద్ద కొడుకు త్రిలోక్ మృతితో తండ్రి శ్రీను రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. కొడుకా పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని సాయంత్రానికి వచ్చేస్తాను అని చెప్పి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయావా అని తల్లి సత్యవతి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

యువతను ఆకట్టుకుంటుంది

'నేను స్టూడెంట్ సర్' హీరో బెల్లంకొండ గణేష్



విలేకరులతో మాట్లాడుతున్న హీరో బెల్లంకొండ గణేష్, చిత్రంలో దర్శక నిర్మాతలు రాఖీఉప్పలపాటి, సతీష్‌వర్మ, హాస్యనటులు రవిశివతేజ, రామ్‌ప్రసాద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'నేను స్టూడెంట్ సర్' సినిమా యువతను ఆకట్టుకునేలా ఉంటుందని హీరో బెల్లంకొండ గణేష్ అన్నారు. ఆదివారం స్థానిక పుష్కరాలరేవులోని ఓ హోటల్‌లో నేను స్టూడెంట్ సర్ సినిమా ప్రమోషన్ టూర్‌లో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో, దర్శక,నిర్మాతలు మాట్లాడారు. హీరో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ తన తొలి చిత్రం స్వాతిముత్యం సినిమా షూటింగ్ ఆత్రేయపురం, రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాల్లో జరిగిందన్నారు. గోదావరి జిల్లాల ప్రజల ఆప్యాయత,ప్రేమ మరువలేనిదన్నారు. స్వాతిముత్యం సినిమా మంచి పేరుతెచ్చినప్పటికీ సరైన సమయంలో విడుదలచేయకపోవడం వలన సరిగ్గా ఆడలేదన్నారు. నేను స్టూడెంట్ సర్ సినిమా ఇప్పుడు సరైన సమయంలో జూన్ రెండవ తేదీన విడుదల చేస్తున్నామన్నారు. ప్రేక్షకులందరూ థియేటర్‌లకు వెళ్లి సినిమా చూసి విజయవంతం చేయాలన్నారు. సినిమా చూసిన తరువాత ప్రేక్షకులకు రియల్‌లైఫ్‌లో జరిగిన ఒక ఇన్సిడెంట్ అన్న అనుభూతి కల్గుతుందన్నారు. నిర్మాత నాంది సతీష్ వర్మ మాట్లాడుతూ దర్శకుడు రాఖీ ఉప్పలపాటి మంచికథతో రావడంతో బడ్జెట్‌కు వెనుకాడకుండా సినిమా తీశానన్నారు. సినిమా కథకు అనుగుణంగా సముద్రఖని, సునీల్, ఇతర తారాగణాన్ని ఎంపిక చేశామన్నారు. నేను స్టూడెంట్ సర్ సక్సెస్ టూర్ రాజమహేంద్రవరంలో నిర్వహిస్తామని నిర్మాత నాంది సతీష్‌వర్మ తెలిపారు. దర్శకుడు రాఖీ ఉప్పలపాటి మాట్లాడుతూ సినిమా ప్రేక్షకులందరికి బాగా నచ్చుతుందని జూన్ రెండవ తేదీన విడుదలైన తరువాత మాట్లాడడమే సబబన్నారు. హాస్యనటుడు రవిశివతేజ మాట్లాడుతూ సినిమాలో ఫన్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయన్నారు. మరో హాస్యనటుడు ఆటోరామ్‌ప్రసాద్ మాట్లాడారు.

ఉపాధి కూలీ మృతి

మండపేట: మండలంలోని ద్వారపూడి గ్రామానికి చెందిన ఉపాధి కూలి ఎస్.రాజేశ్వరి (62) అస్వస్థతకు గురై మృతిచెందింది. శనివారం గ్రామ శివార్లలోని నల్లకాలువ పూడికతీత పనులకు వెళ్లిన రాజేశ్వరి అస్వస్థతకు గురికాగా సహచర కూలీలు ఆమెను గ్రామంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎంపీ డీఓ ఐ.రాజు, ఉపాధి సిబ్బంది పరామర్శించారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు



తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలు

తొండంగి: మండలంలోని ఏ.కొత్తపల్లిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఏ.కొత్తపల్లి గ్రామకమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అనకాపల్లి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఎడ్ల పందాల పోటీదారులు పాల్గొన్నారు. సీనియర్స్ జూనియర్స్ విభాగంలో ఈ పోటీలు జరిగాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గుమ్మిలేరుకు చెందిన కోర వీర వెంకటసత్యవేణికి చెందిన రెండు జోడీల ఎడ్లు నిలిచాయి. తృతీయ స్థానం అనకాపల్లి జిల్లా చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్లబండి గెలుచుకుంది. వీరికి రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. జూనియర్స్ విభాగంలో ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల కోటిశ్రావణ్ ఎడ్లు బండి ప్రథమ, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ద్వితీయ, వడిశలేరుకు చెందిన పైడిశెట్టి సూర్యనారాయణ తృతీయ, వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి చతుర్థ స్థానం సాధించారు. వీరికి రూ.12వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, వైస్ ఎంపీపీ నాగం గంగాభవాని, తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పార్టీ నాయకులు గాబు రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి చిన్న, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నందెపు లోవ లక్ష్మి చిన్న, ఉపసర్పంచ్ శివకోటి గన్నియ్య పాల్గొన్నారు.



బహుమతులు అందజేసిన రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, వైస్ ఎంపీపీ గంగబాబు తదితరలు